ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 7
బుధవారం 9 అక్టోబరు 2024

ప్రజల సొమ్ము రాళ్ల పాలు..!



నంద్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

ఆర్బీకేలు, సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పేరిట గత ప్రభుత్వం హడావుడి చేసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని కలిపి దాదాపు 510 నిర్మాణాలను చేపట్టింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం అన్ని కలిపి జిల్లా వ్యాప్తంగా 1057 నిర్మాణాలను చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే వీటి నిర్మాణాలు అనుకున్నంత వేగంగా జరగలేదు. దీంతో ఎన్నికల ముందు వీటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధి పొందాలనుకుంది. మౌలిక వసతులు కల్పించటంలో శ్రద్ధ వహించకుండా నిర్మించటంతో ప్రస్తుతం ఈ భవనాలన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ముందుచూపు లేకుండా నిర్మించటంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- ఆర్బీకే, సచివాలయం, ఆరోగ్య కేంద్రాల పేరిట గత ప్రభుత్వం హడావుడి
- సరైన వసతులు కల్పించకుండానే నిర్మాణాలు పూర్తి
- నిరుపయోగంగా భవనాలు



జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న రైతు భరోసా కేంద్రం



మధ్యలో నిలిచిపోయిన చాగలమర్రి మండలం మల్లెవేముల ఆర్బీకే భవన నిర్మాణం

● అప్పటికపుడు..

గత వైసీపీ ప్రభుత్వ అన్ని రైతు సేవలు అందించేందుకు ఆర్బీకే (రైతు భరోసా కేంద్రాలు), ప్రజలకు కావాల్సిన సేవలందించేందుకు సచివాలయాలు, వైద్య సేవలు అందించేందుక ఆరోగ్య కేంద్రాలను కట్టించేందుకు పూనుకుంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే దీనికి సంబంధించిన పనులు మొదలుపెట్టింది. జిల్లా వ్యాప్తంగా 394 ఆర్బీకేలు, 248 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 415 సచివాలయాలు నిర్మించేందుకు వెరసి 1057 నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఆ తర్వాత మాత్రం 169 ఆరోగ్య కేంద్రాలు, 361 సచివాలయాలు, 281 ఆర్బీకేలు మొత్తం 810 భవనాల నిర్మాణాలను చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం బిల్లులు వెంటనే విడుదల చేస్తుందన్న ఆశతో కాంట్రాక్టరు వీటి పనులు మొదలుపెట్టారు. జగన్ ప్రభుత్వం ఎప్పటికపుడు బిల్లులు విడుదల చేయకుండా పెండింగ్ పెట్టడం మొదలుపెట్టింది. దీంతో కాంట్రాక్టర్లు చేపట్టిన నిర్మాణాలను తర్వాత కొనసాగించలేదు. అప్పటి వరకు జోరుగా సాగిన ఆయా నిర్మాణాలు తర్వాత కుంటుపడ్డాయి. దీంతో అప్పటి ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు నిర్మాణాలు పూర్తి కాలేదు. చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేయకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, తద్వారా ఎన్నికల్లో దెబ్బ పడుతుందని వైసీపీ నేతలు భావించారు. ఎన్నికల ఏడాది ఆర్బీకే, సచివాలయం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి ఆర్భాటంగా పూర్తి చేసి కొన్నింటిని ప్రారంభించింది. ఈ భవనాలకు విద్యుత్తు, నీటి సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించటంలో విఫలమవటంతో భవనాలు ఉపయోగంలోనికి రాకుండా పోయాయి.

చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య కేంద్రం





కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామంలో సచివాలయం పరిస్థితి

● కోట్ల రూపాయల ఖర్చు..

ఆర్బీకే, సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం వంటి వాటి నిర్మాణాలను జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పూర్తి చేసేలా నిర్మాణాలను చేపట్టింది. సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, ఆర్బీకేలకు రూ.21.80 లక్షలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు రూ.14.95 లక్షల చొప్పున ప్రభుత్వం వెచ్చించింది. జిల్లా వ్యాప్తంగా 116 ఆరోగ్య కేంద్రాలు పూర్తి చేయగా, 52 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. 292 సచివాలయాలు పూర్తి కాగా, 69 నిర్మాణ దశలో, 222 ఆర్బీకేలు పూర్తి కాగా, 59 వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. పూర్తయిన వాటినే పరిగణలోనికి తీసుకుని వాటికి పెట్టిన ఖర్చును లెక్కిస్తే దాదాపు రూ.117 కోట్లను జగన్ ప్రభుత్వం వెచ్చించినట్లు తెలుస్తోంది. ఇక వివిధ దశల్లో ఉన్న భవనాలకు అయిన ఖర్చును కూడా లెక్కిస్తే పెట్టిన ఖర్చు రూ.200 కోట్లు దాటనుంది. పోని ఇన్నేసి కోట్లు ఖర్చు పెట్టినా అవి ఉపయోగంలోనికి వచ్చాయా అంటే అంటే అదీ లేదు. దీంతో ఆయా మండలాల్లోని సచివాలయాలు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడిచాయి. అద్దె రూపంలో చెల్లించే డబ్బు కూడా ప్రభుత్వ ఖజానా నుంచే ఖర్చు పెట్టారు. జగన్ ప్రభుత్వం కేవలం ఆర్భాటం కోసం చేసిన పనివల్ల వందల కోట్ల రూపాయలు ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● అసలు మొదలు కానివి..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆర్బీకేలు, సచివాలయాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను కలిపి 1057 భవనాలను నిర్మించాలనుకుంది. వ్యాప్తంగా 80 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 54 సచివాలయాలు, 113 ఆర్బీకే భవనాలకు అసలు పునాది రాయి కూడా పడలేదు. గత జగన్ ప్రభుత్వానిది ఆరంభ శూరత్వమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మధ్యలో నిలిచిపోయిన పాణ్యంలోని గ్రామీణ ఆరోగ్య క్రేంధ భవన నిర్మాణం

శ్రీశైలం డ్యాంను పరిశీలించిన ప్రపంచ బ్యాంకు బృందం

- ప్లంజ్ పూల్ గుంత తనిఖీ
- తక్షణ మరమ్మతులకు ఫేజ్-1 కింద రూ.102.58 కోట్లు



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంక్, సీడబ్ల్యూసీ టీం సభ్యులు, చిత్రంలో కర్నూలు సీఈ కబీర్‌బాషా, డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి

శ్రీశైలం, అక్టోబరు 8: శ్రీశైలం ప్రాజెక్టును మంగళవారం ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు శ్రీరమేశ్, రాజ్‌గోపాల్‌సింగ్, ఆండీ జెలెన్స్కీ, సీడబ్ల్యూసీ ప్రతినిధి డాక్టర్ హానీ, స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీరు (సీఈ) కుమార్ పరిశీలించారు. డ్రిప్-2 కింద చేపట్టాల్సిన మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా జలవనరుల ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీరు (సీఈ) కబీర్‌బాషా, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తిలు చేపట్టే పనులను ఈ బృందానికి వివరించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు వ్యక్తం చేసిన పలు సందేహాలను నివృత్తి చేశారు. 2009 అక్టోబరులో శ్రీశైలం డ్యాంకు 25.5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద చేరిన సంగతి తెలిసిందే. డ్యాం పైన వరద ప్రవహించింది. వరద ఒత్తిడి డ్యాం బాగా దెబ్బతిందని, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని. డ్యాం క్రస్ట్‌గేట్లు దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ గుంత వల్ల ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందని పలు నిపుణుల కమిటీలు తేల్చి చెప్పాయి. నిపుణుల కమిటీలు ఇచ్చిన సూచనలు మేరకు 'డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' (డ్రిప్)-2 కింద 19 పనులు రూ.203 కోట్లకు ప్రతిపాదనలు కేంద్రానికి పంపారు. 2018 ఆఖరులలో ప్రతిపాదనలు పంపితే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదు. ఈ ఏడాది జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రీశైలం డ్యాం శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించింది. ఆగస్టు 1న డ్యాంను పరిశీలించిన సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుల దృష్టికి ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈ కబీర్‌బాషా, శ్రీశైలం డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తిలు తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబు సూచన మేరకు ప్రపంచ బ్యాంకు, సీడబ్ల్యూసీ ప్రతినిధుల బృందం సోమవారం డ్యాంకు చేరుకుంది. ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండో రోజు డ్యాం గేట్లు, సిలిండర్లు, అప్రాన్, ప్లంజ్‌పూల్ గుంత.. వంటి వాటిని పరిశీలించారు. ఫేజ్-1 కింద రూ.102.58 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపిన బృందం సభ్యులు ఆ నిధులు సకాలంలో అందేలా నివేదికలు ఇస్తామని పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు.

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు పటిష్టంగా నిర్వహిస్తాం : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 8: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న 302 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ రాజకుమారి జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించారు. మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్రంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి పారుదల కింద ఉన్న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై జిల్లా కలెక్టర్లు, జలవనరుల శాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా పరిధిలో కేసీ కెనాల్ కింద 86, ఎస్సార్బీసీ కింద 49, తెలుగుగంగ ప్రాజెక్టు కింద 47, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 120 మొత్తం 302 సాగు నీటి సంఘాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందన్నారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర



ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 8: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు స్వల్పంగా పెరిగాయి. పది రోజుల క్రితం పతనమైన ధరలు స్వల్పంగా పెరుగుతుండటంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు రోజుల్లో పత్తి ధర కింటాకు రూ.200 వరకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజలు, దూది ధరలు స్థిరంగా ఉన్నందున ధరలు పెరిగాయని రైతులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదోని మార్కెట్‌కు 10,195 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,400, గరిష్ఠంగా రూ.7,669, మధ్యస్థంగా రూ.7,439గా పత్తి అమ్ముడుపోయింది.

మిరప ధర పతనం



డి.వనిపెంటలో మిరప పంటను దున్నేస్తున్న రైతు

- రూ. లక్షల్లో నష్టం
- పంటను దున్నేస్తున్న రైతులు


చాగలమర్రి, అక్టోబరు 8: ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసే రైతులకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. మిరప ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని డి.వనిపెంట గ్రామంలో కొందరు రైతులు మిరప పంటపై ఆశలు వదులుకొని మంగళవారం ట్రాక్టర్లతో దున్నేశారు. ప్రత్యామ్నాయ పంట సాగుకు సిద్ధపడ్డారు. కేజీ పచ్చి మిర్చి రూ.10 పలకకపోవడంతో రవాణా ఖర్చులు, కూలీలు డబ్బులు రాకపోవడంతో మిరప పంటను దున్నేశారు. పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష దాకా పెట్టామని, రూ.20 లక్షలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాత్యాయనిగా భ్రమరాంబ

- స్వామి, అమ్మవార్లకు హంస వాహన సేవ
- పుష్ప పల్లకీలో ఊరేగింపు



చిన్నారుల కోలాటం





స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీశైలం, అక్టోబరు 8: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవారు కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా కాత్యాయని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పుష్ప పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆరో రూపమైన ఈ దేవి చతుర్భుజాలను కలిగి, కుడి వైపున అభయ హస్తాన్ని, వరద ముద్రను, ఎడమ వైపు పద్మాన్ని, ఖడ్గాన్ని ధరించి ఉంటుంది. నవదుర్గలలో ఆరవ రూపమైన కాత్యాయనీదేవిని ఆరాధించడం వల్ల రోగ, శోక, భయాలను తొలగించుకోవచ్చునని చెప్పబడింది. ఈ దేవి ఆరాధన వల్ల జన్మజన్మల పాపాలన్నీ కూడా హరింపబడతాయని భక్తుల విశ్వాసం. వాహన సేవలలో భాగంగా హంస వాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులనుజేసి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అశేష భక్తజనం ఈ కార్యక్రమాన్ని కనులారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ప్రత్యేక పూజలు**

శ్రీశైలం క్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, చండీ హోమం, పంచాక్షరీ, భ్రామరీ, బాలాజపానుష్ఠానాలు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారి పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్రపారాయణలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా కుమారి పూజలు జరిపించారు. ఈ కుమారి పూజలలో భాగంగా రెండు సంవత్సరాలు నుంచి పది సంవత్సరాలలోపు బాలికకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమరించారు.

● దసరా మహోత్సవాల్లో ఏడో రోజు బుధవారం భ్రమరాంబికా అమ్మవారు కాళరాత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లకు గజ వాహన సేవ నిర్వహించనున్నారు.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు



చిన్నారుల గిరిజన సాంప్రదాయ నృత్యం



బాలికల నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న వేషధారణలు



డ్రమ్స్ వాయిస్తున్న కళాకారులు

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఆలయంలో చండీయాగం


చండీ యాగలో పాల్గొన్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, అక్టోబరు 8: దసరా నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని సుంకులా పరమేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆరవ రోజు చండీయాగాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో మాండ్ర శివానందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు వీరం ప్రసాద్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ముర్తుజావలి, వేణుగోపాల్, సురేంద్ర, కృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో రాజంపేట ఎమ్మెల్యే పూజలు


మహానందిలో ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏఈవో

మహానంది, అక్టోబరు 8: మహానంది క్షేత్రంలో రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి మంగళ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వీరికి ఏఈవో ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చన పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. యాగశాల మంటపంలో ఎమ్మెల్యేను సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

వాసవీ కన్యకా పరమేశ్వరిని దర్శించుకున్న కమిషనర్

నందికొట్కూరు, అక్టోబరు 8: పట్టణంలోని శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కమిషనర్ బేబి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సదర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు కమిషనర్‌ను సన్మానించి ప్రసాదం అందజేశారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం

నందికొట్కూరు, అక్టోబరు 8: నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ బేబీ, వైస్ చైర్మన్ రబ్బాని పరిశీలించారు. పట్టణంలోని 16వ వార్డులోని మార్కెట్ యార్డులో కూరగాయల వ్యాపారం చేసే వ్యాపారులు, రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ చిన్న రాజు, 16వ వార్డు ఇన్‌చార్జి లింగాల శ్రీకాంత్‌గౌడ్, 8వ వార్డు ఇన్‌చార్జి శాలి బాషా, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తు బెడ్ల విధానంలో అధిక దిగుబడి

నందికొట్కూరురూరల్, అక్టోబరు8 : సోయాచిక్కుడు పంటను ఎత్తు బెడ్ల విధానంలో పండించి అధిక దిగుబడులు సాధించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి పల్లె సీనియర్ సైంటిస్టు రమణయ్య తెలిపారు. శాతనకోట గ్రామంలో ఎత్తు బెడ్ల విధానంలో పండించిన సోయాచిక్కుడు పంటపై క్షేత్ర దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అధికారులు ఏడీఏ విజయశేఖర్, ఏవో షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. కృషివిజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడు, డీఆర్‌సీఏవో హేమలత, శాతనకోట రైతులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

● ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

కొత్తపల్లి, అక్టోబరు 8: యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. మంగళవారం రాత్రి కొత్తపల్లి మండలం శివపురం బస్టాండు సెంటరులో స్థానిక ఎస్‌ఐ కేశవ అధ్యక్షతన యువతకు మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువతకు ఎంతో మంచి భవిష్యత్తు ఉందని, మత్తు పదార్థాలకు బానిసలైతే మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. ఆత్మకూరు రూరల్‌సీఐ సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఓటీపీ ఫ్రాడ్స్ సైబర్ క్రైమ్స్, మహిళలపై జరిగే నేరాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెన్నకేశవయాదవ్, గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం: కమిషనర్

ఆత్మకూరు, అక్టోబరు 8: ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల జరిగిన అక్రమణలపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపారు. మంగళవారం కమిషనర్ రమేష్‌బాబు నేతృత్వంలో పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు సర్వేయర్లు గౌడ్‌సెంటర్ నుంచి నంద్యాల టర్నింగ్ వరకు కేజీరోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను గుర్తించే తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు 45 మందికి నోటీసులు జారీ చేస్తామని, ఇంకా ఆక్ర మణలను గుర్తించి వారికి కూడా నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారమే తొల గించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపాలి

మహానంది, అక్టోబరు 8: గిరిజనులు ఉద్యానవన పంటల సాగుపై ఆసక్తి చూపాలని ఉద్యావనశాఖాధికారి శ్రీధర్ అన్నారు. మంగళవారం మహానంది సమీపంలోని గిరిజన గూడెంలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది, ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఉద్యావన పంటల సాగుతో పాటు దిగుబడి మెలుకువలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈపంట నమోదును తప్పక చేసుకోవాలని అన్నారు. సర్పంచ్ చలం శిరీష, జిల్లా వనరులు ఏవో చంద్రశేఖర్‌రెడ్డి వీఆర్వో సురేంద్ర, సిబ్బంది వసుంధర, కృష్ణకాంత్‌లు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నందికొట్కూరు, అక్టోబరు 8: అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వైసీపీ నాయకుడు ధార సుధీర్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు నందికొట్కూరు పట్టణంలోని ఇన్‌డోర్ స్టేడియం మైదానంలో తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని అయన పరిశీలించారు. నష్టపోయిన రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చే యాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రూ.3వేలకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గడివేముల: వర్షాల వల్ల తడిచిన సోయాబీన్, మొక్క జొన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. మండలంలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామా ల్లోని తడిచిన సోయాబీన్ ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజశేఖర్, మద్దిలేటి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల వెల్లువ


సమస్య వింటున్న ఎమ్మెల్యే చరిత

గడివేముల, అక్టోబరు 8: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. 113 అర్జీలు రాగా అందులో రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయి. ఆన్‌లైన్ నమోదు కాలేదని, భూ ఆక్రమణలు జరిగాయని, రీసర్వేలో పొలం నమోదు తక్కువ విస్తీర్ణం చేశారని, ఇళ్ల స్థలాలు కావాలని, ఇలా రెవెన్యూ సంబంధించి 52 దరఖాస్తులు వచ్చాయి. ఈ సమస్యలను పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలం లోని పెసరవాయి గ్రామానికి చెందిన మూడు పొదుపు సంఘాలకు సంబం ధించి రూ.24 లక్షల శ్రీనిధి నిధులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీడీవో వాసుదేవగుప్త, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, రవణమ్మ, అనసూయమ్మ, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవిగా అమ్మవారు

దసరా వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. 6వ రోజు మంగళవారం ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి స్వామి అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చనలు, రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమించారు. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


ఆత్మకూరులో మహాగౌరీదేవి అలంకరణలో ..


లలితాదేవి అలంకారంలో అమ్మవారు


మిడుతూరు మహాలక్ష్మీదేవిగా


బాలాజీ కళ్యాణమండపంలో ధనలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు


బండి ఆత్మకూరు: ఓంకారంలో మహాలక్ష్మీ అమ్మవారుగా ఉమామహేశ్వరి


జూపాడుబంగ్లా సరస్వతీ ఆలయంలో కాత్యాయనిగా..


నంద్యాల కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంలో..


పాణ్యం: మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు


ఆత్మకూరులోని కిషన్‌సింగ్ వీధిలో మహాలక్ష్మీదేవీ అలంకరణలో


కొత్తపల్లి: మహాగౌరి అలంకరణలో దర్శనం ఇచ్చిన కొలనుభారతి సరస్వతి అమ్మవారు


నంద్యాలసంజీవనగర్ రామాలయంలో మహాలక్ష్మీదేవిగా


ముచ్చుమర్రిలోని జమ్ములపరమేశ్వరి ఆలయంలో..

అశ్వవాహనంపై కాత్యాయని దుర్గా


మహానందిలో కాత్యాయని దుర్గా అలంకారంలో కామేశ్వరీదేవి

మహానంది: దసరాదేవి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహానంది క్షేత్రంలో కామేశ్వరీదేవి అమ్మవారు మంగళవారం కాత్యాయని దుర్గా అలంకారంలో భక్తులకు దర్శనమించారు. ప్రధాన కామేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రకాశంశర్మ, మామిళ్లపల్లి రాఘవశర్మ, జనార్దన్‌శర్మ ప్రత్యేక కుంకుమార్చన పూజలను వేదమంత్రాలతో నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో కలశపూజలు, చండీహోమములతో పాటు శ్రీచక్రార్చనలను భక్తి శ్రద్ధలతో జరిపారు. సాయంకాలం అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవలను జరిపారు. రాత్రి 9 గంటల నుంచి ఆలయ పురవీధుల గుండా ఆశ్వ వాహనంపై కాత్యాయనిదుర్గను ఆశీనులను చేసి, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, శానిటేషన్ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 8: జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాలలో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అన్న క్యాంటీన్లు, 200రోజుల ప్రణాళిక, ఎస్టీపీల్యాండ్, పట్టణ సుందరీకరణ, శానిటేషన్, తాగునీటి సరఫరా తదితర అంశాలో మున్సిపల్ కమీషనర్లతో సమీక్షించారు. మురికి నీటి శుద్ధి ప్లాంట్లకు అవసరమయ్యే స్థలాలకు నంద్యాలలో మూడు ఎకరాలు, ఆళ్లగడ్డలో 2.8, ఆత్మకూరులో 3, నందికొట్కూర్‌లో 3.4, డోన్‌లో 7.5 ఎకరాల స్థల సేకరణ కోసం సంబంధిత ఆర్డీవోలతో కోఆర్డినేట్ చేసుకొని వారం రోజుల్లో ప్రతిపాదనలు కలెక్టరేట్ పంపాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు మున్సిపాలిటీలలో అందుబాటులో ఉన్న నిధులతో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డోన్ మున్సిపాలిటీలో అమృత్ సరోవర్ కింద ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణం, నంద్యాలలో బయోగ్యాస్‌కు అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని గుర్తించాలని నంద్యాల ఆర్డీవోను ఆదేశించారు. నంద్యాలలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. సమావేశంలో నంద్యాల ఆర్డీవో మల్లిఖార్జునరెడ్డి, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూర్ కమిషనర్లు, డోన్ బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్లు పాల్గొన్నారు.

14నుంచి పల్లె పండుగ -పంచాయతీ వారోత్సవాలు

ఈ నెల 14 నుంచి 20వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమలో నిర్దేశించిన అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పల్లెపండుగ కార్యక్రమం నిర్వహణపై ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, అడవులు, సైన్స్-టెక్నాలజీ, పర్యావరణ శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి కలెక్టర్ రాజకుమారి, డ్వామా పీడీ, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

ఈ-పంట నమోదు తనిఖీ


పంట నమోదును తనిఖీ చేస్తున్న జేసీ విష్ణుచరణ్

గడివేముల, అక్టోబరు 8: మండలంలోని గని గ్రామంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఈ-పంట నమోదు తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ సిబ్బంది పంట నమోదును సక్రమంగా చేశారా లేదా అన్న విషయంపై ఆయన సూపర్‌చెక్ చేశారు. అనంతరం రైతులతో పంట సాగుపై ఆరా తీశారు. పంట లాభదాయకంగా ఉందా, గిట్టుబాటు అవుతుందా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ-పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ-పంట నమోదు వల్ల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, ఏడీ రాజశేఖర్, తహసీల్దార్ వెంకటరమణ, మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక


పాములపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు అక్టోబరు 8 : గ్రామాల్లో ప్రజా సమస్యలు తీర్చేందుకే మండలంలోని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం పాములపాడులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ పంట పొలాలకు రస్తాలు లేవని, ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని , భూసమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను సమర్పించారు. సమస్యలను ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు ఆళ్ళగడ్డ హరి సరోవత్తమరావు, మధు కృష్ణ, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, చెల్లె హరినాథ రెడ్డి, సత్యంరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పూసల కృష్ణ, హఫీజ్, రామకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ రాము చౌదరి, ఏసేపు, అలిసాహెబ్, మల్లికార్జున, మద్దిలేటి, లింగేష్ గౌడ్, లింగస్వామి, నాగలక్ష్మి, రెడ్డి, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సంగమేశ్వరం-జానాలగూడెం బీటీ రోడ్డు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం నుంచి సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.4.50 కోట్ల నిధులు మంజూరైనట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం తాను, టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి చొరవతో సంగమేశ్వరం నుంచి జానాల వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ గ్రామాలు నేటికి కూడా విద్యుత్ సౌకర్యానికి నోచుకోకపోవడంతో రూ.55 లక్షలు మంజూరు చేయించామన్నారు.

పతకాలు సాధించడం ప్రశంసనీయం


క్రీడాకారుడిని సన్మానిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 8 : వైకల్యాన్ని జయించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రశంసించారు. నంద్యాలకు చెందిన అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారుడు అర్షద్‌ను మంగళవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దివ్యాంగుడైనా ఆత్మ విశ్వాసంతో అన్ని క్రీడల్లో రాణించడం విశేషమన్నారు. అర్షద్ విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డా.రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా. వసుధారాణి, డా.పనిల్, డా.అనిల్‌కుమార్, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ రమణయ్య పాల్గొన్నారు.

'ఫార్మాసిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

నంద్యాల రూరల్, అక్టోబరు 8 : రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేస్తున్న ఫార్మాసిస్టులకు ఉద్యోగభద్రత కల్పించాలని ఫార్మసీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి చక్రధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చక్రధర్, ఫార్మా ప్రభుత్వ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్, ప్రభాస్ కళాశాల ప్రిన్సిపాల్ సారథి హాజరయ్యారు. జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివ, విష్ణు వర్ధన్, రాజశేఖర్, సుధీర్, సభ్యులను నియమించారు.

సూపర్‌లీగ్‌కు చేరుకున్న జాతీయ స్థాయి పోటీలు

నంద్యాల రూరల్, అక్టోబరు 8 : ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి జూనియర్స్ బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో దేశవ్యాప్తంగా 23రాష్ట్రాల జట్లు పాల్గొనగా హోరాహోరీగా సాగిన పోటీల్లో విజయాలు సాధించి సూపర్‌లీగ్‌కు అర్హత సాధించాయి. మంగళవారం జరిగిన పోటీలకు గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. బాలుర ప్రి క్వార్టర్స్‌లో రాజస్థాన్‌పై బీహార్, తెలంగాణపై ఢిల్లీ, ఢిల్లీపై మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌పై కేరళ, హర్యానాపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడుపై పంజాబ్, జమ్మూకాశ్మీర్‌పై చత్తీస్‌ఘడ్, చండీఘడ్‌పై మహారాష్ట్ర, కర్ణాటక జట్లు విజయం సాధించి సూపర్‌లీగ్‌కు అర్హత సాధించాయి. బాలికల విభాగంలో చండీఘడ్‌పై తెలంగాణ, హర్యానాపై ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌పై మధ్యప్రదేశ్, తమిళనాడుపై మహారాష్ట్ర, రాజస్థాన్‌పై చత్తీస్‌గఢ్, ఒరిస్సాపై పంజాబ్, గుజరాత్‌పై ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాళ్‌పై కేరళ జట్లు విజయం సాధించి సూపర్‌లీగ్‌కు అర్హత సాధించాయని నిర్వాహకులు తెలిపారు.

జాతీయస్థాయి ఖోఖో క్రీడలకు ఎంపిక


యామిని

పాణ్యం, అక్టోబరు 8 : జాతీయస్థాయి ఖోఖో క్రీడలకు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ విద్యార్థిని వై. యామిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం నెల్లూరు ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ కళాశాలలో జరిగిన జాతీయ సౌత్‌జోన్ యూనివర్సిటీ క్రీడల జట్టు ఎంపికలో జేఎన్‌టీయూఏ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరులో కేరళలోని కేలికట్ యూనివర్సిటీలో జరిగే జాతీయ సౌత్ జోన్ యూనివర్సిటీ క్రీడల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. విద్యార్థినీని కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతి రాముడు, ఎండీ శివ రాం, డీన్ డాక్టర్ అశోక్ కుమార్, పీడీ వెంకటేశ్ అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, అక్టోబరు 8: ఆత్మకూరు ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సాధికారత అధికారి లీలావతిదేవీ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఆత్మకూరు ఐసీడీఎస్ పరిధిలోని రుద్రకోడూరు, పెచ్చెర్వు గూడేల్లో మినీ కార్యకర్తలు (ఎస్టీ), ఆత్మకూరు-19 (ఓసీ-జనరల్), ఆత్మకూరు- 22 (బీసీ-బీ), బండిఆత్మకూరు మండలంలోని బోధనం (ఓసీ), బండిఆత్మకూరు-1 (ఓసీ), బండిఆత్మకూరు-2 (ఈడబ్ల్యుసీ), బరకలకాలనీ (ఎస్టీ), మహానంది మండలంలోని సీతారామాపురం-2 (బీసీ-సీ), మసీదుపురం-2 (బీసీ-జనరల్), గాజులపల్లి - (ఓహెచ్-జనరల్), శ్రీశైలం-6 (ఎస్సీ) అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మినీ కార్యకర్త, అం గన్‌వాడీ హెల్పర్ పోస్టులకు సంబంధించి 10వ తరగతి విద్యార్హత కలిగి ఉండి, 21నుంచి35ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని చెప్పారు. స్థానికురాలితో పాటు వివాహితురాలై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు జనన, కుల, విద్యార్హత, నివాస, వివాహ, ఆధార్, రేషన్ తదితర ధృవీకరణ పత్రాలతో ఈ నెల 21వ తేది సాయంత్రం 6గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని గడివేముల 1వ అంగన్‌వాడీ కేంద్రంలో, మంచాలకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టులకు ఆసక్తి ఉన్న వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి తెలిపారు. గడివేముల-1 కేంద్రానికి బీసీ-బి, మంచాలకట్ట 1 ఈడబ్ల్యూఎస్ కేటగిరికి కేటాయించారని అన్నారు.

సమస్యలపై పోరాటాలు చేయాలి

బండిఆత్మకూరు, అక్టోబరు 8: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభ్యులు దృష్టిసారించాలని సీపీఎం జిల్లానాయకుడు రత్నమయ్య, మండల ఆయకులు డేవిడ్, రాజు సూచించారు. మంగళవారం బండిఆత్మకూరులో గ్రామశాఖ సమావేశం శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ కార్యదర్శిగా పుల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయూబ్, రమణమ్మ, సర్దార్, జుబేదా, గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

- ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు

కొత్తపల్లి, అక్టోబరు 8: ప్రైవేటు మద్యం దుకాణాలకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని నంద్యాల ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.రాముడు తెలిపారు. మంగళవారం ఆయన కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసలుబాటు కల్పించిందన్నారు. ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకునేవారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఏఈఎస్ తెలిపారు.

వైభవంగా తిక్కయ్యస్వామి ఉరుసు ప్రారంభం

ఆత్మకూరు, అక్టోబరు 8: ఆత్మకూరు పట్టణంలో తిక్కయ్యస్వామి దర్గాలో హజరత్ సయ్యద్ హబిబుల్లా షాఖాద్రి అల్‌మారుఫ్ దివాన్‌షావలి రహ మతుల్లా అలైహి(తిక్కయ్య స్వామి) ఉరుసు మహోత్సవం మంగళవారం గంధం వేడుకతో ప్రారంభమైంది. బుధవారం ఉరుసు, గురువారం జియారత్‌తో మహోత్సవానికి ముగింపు పలకనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

నేడు కొలనుభారతిలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి, అక్టోబరు 8: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి సరస్వతి అమ్మవారి క్షేత్రంలో బుధవారం మూలనక్షత్రం సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం సాయంత్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఈవో రామలింగారెడ్డి, చైర్మన్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు పేర్కొన్నారు. ఆర్యవైశ్య సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పురోహితులు తెలిపారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, అక్టోబరు 8 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లానైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఫిరోజ్ ప్రారంభించారు. ఐదు కంపెనీల నుంచి జిల్లాలోని నిరుద్యోగులకు దాదాపు 415ఉద్యోగ అవకాశాలను జాబ్ మేళా ద్వారా కల్పిస్తున్నట్లు ఫిరోజ్ తెలిపారు. ఉద్యోగం రానివారు నిరుత్సాహపడకూడదని ప్రతినెలా ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టే జాబ్ మేళాలో పాల్గొని అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పార్వతి పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు

పాణ్యం, అక్టోబరు 8 : మండలంలోని నెరవాడ ఏడవ వార్డులో టీడీపీ నాయకులు అమరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొవడంతో సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. దాంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

టెట్‌కు 270 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 8: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు మంగళవారం 270 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లకు 3,226 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2,956 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 270 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 1614 మందికి గాను, 1464 మంది హాజరు కాగా, 150 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన టెట్ పరీక్షకు 1612 మందికి గానూ 1492 మంది అభ్యర్థులు హాజరు కాగా, 120 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇన్‌చార్జి డీఈవో ఏడీ-2 శ్రీనివాసులు, ఏడీ-1 శ్యామూల్ పాల్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష నిర్వాహకులకు సూచనలు చేశారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

● జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 8: ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్డీ, డీఎల్‌పీఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం డీపీఆర్‌సీ భవనంలో జడ్పీ సీఈఓ వై. పాపిరెడ్డి, సీఈఓ జి. నాసరరెడ్డి, డీపీఓ ఎల్. భాస్కర్ ప్రారంభించారు. మంగళవారం జరిగిన శిక్షణలో గ్రామ పంచాయతీలలో సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర అంశాలపై శ్రీకాళహస్తిలో శిక్షణ తీసుకున్న టీఓటీలు ఎంపిడీఓలు, ఈఓఆర్డీ, డీఎల్‌పీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ తిమ్మక్క, ఎంపీడీఓలు రఘునాథ్, శ్రీనివాసులు, నాగశేషాచలరెడ్డి, ఈఓఆర్డీలు అనూరాధ పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాను వినియోగించుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దనరెడ్డి



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్ రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 8: పోస్టాఫీసులో అందుబాటులో ఉన్న తపాలా జీవిత బీమాను అదరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి అన్నారు. జాతీయ తపాలా దినోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన తపాలా కార్యాలయంలో తపాలా జీవిత బీమాపై డైరెక్ట్ ఏజెంట్స్, ఫీల్డ్ ఆఫీసర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ నూరుల్లా, డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరిక్రిష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గ దేవస్థానం నిధుల స్వాహాపై విచారణ



కాల్వబుగ్గలో రికార్డులు పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, అధికారులు

ఓర్వకల్లు, అక్టోబరు 8: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి దేవస్థానం నిధుల స్వాహాపై మంగళవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఆయనతో పాటు అధికారులు, హుశేనాపురం రాయలసీమ గ్రామీణ బ్యాంకుకు వెళ్లి దేవాలయం అకౌంట్లును పరిశీలించారు. అనంతరం కాల్వబుగ్గ ఈవో కార్యాలయంలో రికార్డులను, క్యాష్ బుక్‌ను పరిశీలించారు. ఒక ఖాతా నెంబరులో రూ.1.30 కోట్లు దశలవారిగా నిధులు స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇంకా విచారణ కొనసాగుతున్నదని, సమగ్ర నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కు అందజేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

● కార్యనిర్వహణ అధికారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి - ప్రజా సంఘాల డిమాండ్: అవినీతి అక్రమాలకు పాల్పడిన కాల్వబుగ్గ ఈవో బీఆర్‌కేవీ ప్రసాద్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి స్వాహా చేసిన నిధులను రాబట్టాలని సీపీఎం జిల్లా నాయకుడు రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తుంగభద్ర నదిలో భక్తుడి గల్లంతు

మంత్రాలయం, అక్టోబరు 8: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తుడు తుంగభద్ర నదిలో పుణ్యస్నానికి వెళ్లి గల్లంతయ్యాడు. కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ జిల్లా ద్వారగానహల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయప్ప (34) తన ఇంటి పక్కన ఉన్న వారితో రాఘవేంద్రస్వామి దర్శనార్థం మంగళవారం మంత్రాలయం వచ్చాడు. మూడున్నర గంటల సమయంలో తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు స్నానానికి నదిలో దిగారు. దీంతో సుబ్బరాయప్ప నీటిలో గల్లంతయ్యాడు. తన వెంట వచ్చిన వ్యక్తులు అరుపులు, కేకలు వేసినప్పటికీ నదీతీరంలో ఉన్న గ్రామస్థులు, గజ ఈతగాళ్లు వచ్చేసరికి కనిపించకుండాపోయాడు. సాయంత్రం 6.30 గంటల వరకు పోలీసులు, గజ ఈతగాళ్లు పుట్టీలతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మంగళవారం చీకటి పడటంతో గాలింపు నిలిపివేశారు. బుధవారం ఉదయం మళ్లీ తిరిగి గాలింపు చర్యలు చేపడుతామని తెలిపారు. మృతుడికి భార్య ఏడేళ్ల క్రితమే మృతి చెందింది. లీలా అనే కూతురు ఉంది. గల్లంతైన విషయం కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

శివాలయంలో చోరీ

జూపాడుబంగ్లా, అక్టోబరు 8 : మండల కేంద్రంలో సోమవారం శివాలయంలో తాళాలు పగులగొట్టి దుండగులు చోరీ చేశారు. దేవాలయంలో ఉన్న 20 సిమెంట్ సంచులు, మైక్‌సెట్, రెండు ఆముదం నూనె డబ్బాలు తీసుకెళ్లారు. భక్తులు దేవాలయం దగ్గరకు పూజల కోసం వెళ్లగా చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామస్తులు రామక్రిష్ణ, శ్రీనివాసులు, బ్రహ్మయ్య తదితరులు కలిసి ఎస్‌ఐ లక్ష్మీనారాయకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

సి.బెళగల్, అక్టోబరు 8: ఆరు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని సాగు చేసిన రైతులను అరెస్టు చేశారు. మండలంలోని పలుకుదొడ్డి గ్రామానికి చెందిన భూప తిరాముడు అనే రైతు తన మిరప చేలో సి.బెళగల్‌కు చెందిన హనుమంతుతో కలిసి గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు స్థానికులు ఎస్‌ఐ తిమ్మారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి, కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల పోలీసులతో కలిసి మిరప పంటలో పెంచుతున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో పంచానమా చేశారు. అనంతరం వారి ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

14 నుంచి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో డిప్యూటీ సీఎం



వివరాలను వెల్లడిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 8: రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల సందర్భంగా జిల్లాలో రూ.105 కోట్లతో సిమెంటు రోడ్లు, గోకులాల తదితర పనులకు శంకుస్థాపనలు నిర్వహించనున్నామని కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. ఈ విషయంలో శాసనసభ్యులను సంప్రదించి రోజువారి షెడ్యూల్‌ను రూపొందిస్తామని తెలిపారు. గ్రామ సచివాలయ, ఉపాధి హామీ, లైన్ డిపార్టుమెంట్ సిబ్బంది అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీ పనులకు సంబంధించి పని దినాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించిన హొళగుంద, చిప్పగిరి, కృష్ణగిరి, తుగ్గలి, గూడూరు మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీవో భాస్కర్, డ్వామా పీడీ మాధవీలత, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, ఈఈ మద్దన్న పాల్గొన్నారు.

ఉల్లి, టమోటా ధరలను నియంత్రణలో ఉంచాలి: మంత్రి



కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 8: జిల్లాలో ఉల్లి, టమోటా ధరలను నియంత్రణలో ఉంచాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ధరల నియంత్రణపై కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మార్కెటింగ్ శాఖ ఏడీ, తహసీల్దార్లు, మార్కెట్ యార్డుల సెక్రటరీలు, రైతుబజార్ ఎస్టేట్ అధికారులు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిరోజూ జిల్లాలో ధరల వివరాలకు సంబంధించిన నివేదికలను పంపాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి, టమోటా ధరల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ ఆయిల్ మిల్లర్లు, రిటైలర్లు, హోల్‌సేలర్లతో సమావేశం నిర్వహించి సంప్రదింపులు జరిపామని, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.126కు, పామాయిల్ రూ.121కు అందిస్తామని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆర్డీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిటీ కేబుల్‌లో నీలిచిత్రాల ప్రసారం

● కేబుల్‌ను నిలిపేయాలని ట్రాయ్‌కు, పోలీసులకు ఫిర్యాదు

నందికొట్కూరు, అక్టోబరు 8: నందికొట్కూరు సిటీ కేబుల్‌లో ఏకంగా నీలి చిత్రాల ప్రసారమయ్యాయి. టీవీలు చూస్తున్న జనం ఒక్కసారిగా అవాక్కయ్యారు. నందికొట్కూరు పట్టణంలోని ఫిరోజ్ కేబుల్‌లో ఆపరేటర్ల అజాగ్రత్త వల్ల గంట పాటు నీలి చిత్రాలు ప్రసారమయ్యాయి. దసరా పండుగ సందర్భంగా పిల్లలకు సెలవులు కావడంతో ఇంట్లో ఉంటూ టీవీలు చూస్తుంటారు. ఇలాంటి సమయంలో నీలి చిత్రాలు ప్రసారం కావడంతో చిన్నారులు, మహిళలు ఇబ్బంది పడ్డారు. ఫిరోజు కేబుల్‌కు నియోజకవర్గంలో దాదాపు 10 వేల కనెక్షన్లు ఉన్నాయి. ఈ కేబుల్ ఆపరేటర్లు గంటపాటు నీలిచిత్రాలు ప్రసారం అవుతున్నా పట్టించుకోకపోవడంలో వారి నిర్లక్ష్యమే కారణమని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించేందుకు కేబుల్ ఓనర్‌ను సంప్రదించగా ఆయన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. గతంలో కూడా ఈ కేబుల్‌లో ఇలాంటి ప్రసారాలు జరిగినట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో కేబుల్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని కేబుల్ ప్రసారాలను వెంటనే నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● **ట్రాయ్ చట్టానికి ఫిర్యాదు:** నీలి చిత్రాలను ప్రసారం చేసిన ఫిరోజ్ కేబుల్ నెట్‌వర్క్‌పై పగిడ్యాలకు చెందిన కిరణ్‌రెడ్డి టెలికామ్ రెగ్యులారిటీ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. సంఘ విద్రోహ చర్యగా భావించి చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి నందికొట్కూరుకు చెందిన ఉదయ్‌కిరణ్ కిరణ్ రెడ్డి, పట్టణ ప్రజలు ఫిర్యాదు చేశారు.

రబీలోనూ శనగల కేటాయింపులో కోత

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 8: ప్రస్తుతం ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ మొదలైంది. ప్రధానంగా రైతులకు అవసరమైన విత్తనాలను సరిపడా అందించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులు ఆశించారు. అయితే ఖరీఫ్‌లో మాదిరిగానే రబీ సీజన్‌లోనూ వివిధ పంటలకు సంబంధించి విత్తనాలను సరిపడా అందించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 68,068 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు అవసరమని కర్నూలు జిల్లా అధికార యంత్రాంగం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు ఇటీవలే అందించింది. అయితే 41,695 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను మాత్రమే కేటాయించడంపై రైతులు ఏ మూలకు సరిపోతాయని ఆందోళన చెందుతున్నారు. కర్నూలు డివిజన్‌కు 13,562 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు అవసరం ఉందని ప్రతిపాదన పంపిస్తే 8,595 క్వింటాళ్లను కేటాయించామని జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆదోనికి 655 క్వింటాళ్లకుగాను అదే మొత్తంలో విత్తనాలు కేటాయించారు. ఎమ్మిగనూరుకు 1290 క్వింటాళ్లకుగాను 1350 క్వింటాళ్లు కేటాయించారని, ఆలూరుకు 34,068 క్వింటాళ్లకు గానూ 22,385 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలను కేటాయించారు. పత్తికొండకు 10,493 క్వింటాళ్లు అవసరం కాగా, 8,710 క్వింటాళ్లు మాత్రమే కేటాయించడంపై అధికారులు కూడా ఇవి ఏ మూలకు సరిపోవని, రైతుల నుంచి తాము నిరసన ఎదుర్కోవాల్సి ఉందని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు ప్రస్తుత రబీలో 70 వేల హెక్టార్లలో ఈ పంటను సాగు చేస్తారు. అయితే.. 41,695 క్వింటాళ్లను మాత్రమే కేటాయించింది. సబ్సిడీ పోను కిలోకు రూ.70.50 చెల్లించాలి. సబ్సిడీపై పప్పుశనగ జేజీ-11 రకం శనగ విత్తనాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించినట్లు జేడీ తెలిపారు. ఇందులో 25 శాతం సబ్సిడీని అందిస్తున్నామని, కిలోకు 25 శాతం సబ్సిడీ ప్రకారం రూ.23.50 ధర నిర్ణయించామన్నారు. సబ్సిడీ పోగా కిలోకు రైతులు రూ.70.50 చెల్లించాల్సి ఉందని తెలిపారు.

గీతా మందిరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు



శాంకరీదేవిగా అమ్మవారు



సామూహిక పూజల్లో పాల్గొన్న దంపతులు

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 8: పాతనగరంలోని గీతా మందరంలో దసరా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం ఉదయం నిత్య ప్రార్థన, సూర్య నమస్కారాలు, గీతా పారాయణం చేశారు. అనంతరం కలశపూజ, హోమలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకములతో సహస్ర నామ అర్చనలు, పూజలు చేశారు. ఆరేళ్ల చిన్నారులకు కుమారి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శాంకరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో గీతా మందిరం గౌరవాధ్యక్షుడు కామిశెట్టి గురువయ్య, అధ్యక్షుడు రేగూరు విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు ఈపూరు ఓంప్రకాశ్, కార్యదర్శి తల్లం గోవిందకృష్ణయ్య, కోశాధికారి చిత్రాల సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు చిత్రాల కృష్ణయ్య, నాగరాళ్ల భాస్కర్, నరహరి శ్రీనివాసులు, రేగూరు బాలకృష్ణ, బియ్యపు రంగనాథ్, వేముల హరి, రాచమడుగు రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

● నలుగురికి గాయాలు

పెద్దకడుబూరు, అక్టోబరు 8: బొలేరో-ఆటో ఢీకొన్న ప్రమాదంలో వీరేష్(13) అనే బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదోని-పులికనుమ ప్రధాన రహదారిలో మంగళవారం జరిగింది. బసలదొడ్డి గ్రామానికి చెందిన బాలుడు వీరేష్(13) అవ్వ హనుమంతమ్మతో పాటు కూరగాయలు తీసుకొచ్చేందుకు ప్యాసింజర్ ఆటోలో ఆదోనికి వెళ్లాడు. అదే దారిలో దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన కురువ నాగేంద్ర బొలేరో వాహనం అజాగ్రత్తగా అతివేగంగా నడుపుకుంటూ వచ్చి ముందు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఆటోలో ప్రయాణిస్తున్న వీరేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న స్వల్ప గాయాలైన నలుగురిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాలేరు నగరి కాల్వలో బాలుడి గల్లంతు

బనగానపల్లె, అక్టోబరు 8: బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, సుధాకర్‌ల కుమారుడు మధురుచి (11) అనే ఐదో తరగతి బాలుడు గాలేరు నగరి కాల్వలో పడి మంగళవారం గల్లంతయ్యాడు. గ్రామ సమీపంలోని గాలేరు నగరి ఒడ్డున ఆడుకుంటూ వెళ్లి మధురుచి ప్రమాదవశాత్తు గాలేరు నగరి కాల్వలో పడ్డాడు. అక్కడ ఉన్నవారు బాలుడ్ని రక్షించడానికి శతవిధాలా యత్నించినా కాపాడలేకపోయారు. ఈ మేరకు తల్లిదండ్రులు బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గల్లంతైన బాలుడి కోసం పోలీసులు, మృతుని బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. యాగంటిపల్లెలోని ఉన్నతపాఠశాలలో బాలుడు చదువుతున్నారు.

శ్రీశైల మల్లన్న సన్నిధిలో సినీ నటుడు గోపీచంద్



ఆలయ ప్రాంగణంలో సినీనటుడు గోపీచంద్

శ్రీశైలం, అక్టోబరు 8: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంగళవారం తెలుగు సినీ నటుడు గోపీచంద్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న హీరో గోపీచంద్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గోపీచంద్ స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించుకున్నారు. తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజాధికాలు నిర్వహించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

భర్తకు జీవిత ఖైదు

గోస్పాడు, అక్టోబరు 8: మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన నేస బాల ఓబన్నకు తన భార్య నేస నాగమ్మను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు పడింది. దాదాపు రెండేళ్ల క్రితం కుటుంబ కలహాలతో బాల ఓబన్న తన భార్య నాగమ్మను గొడ్డలితో హత మార్చాడు. ఈ కేసులో మంగళవారం ఆళ్లగడ్డ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి బాల ఓబన్నకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు. దీంతో ఓబన్నను పోలీసులు సబ్ జైలుకు తరలించారు.

కూలీల ఆటో బోల్తా.. ఒకరి మృతి

● ముగ్గురి పరిస్థితి విషమం

● 25 మందికి గాయాలు

హాలహర్వి, అక్టోబరు 8 : కర్ణాటక రాష్ట్రం మోకా ప్రాంతానికి చెందిన కూలీల ఆటో సరిహద్దులో బోల్తా పడింది. ఆటోలో ఉన్న కూలీలంతా కుప్పకూలారు. అందులో ఒకరు మృతి చెందారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. అతివేగంగా రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

సి.బెళగల్, అక్టోబరు 8: మండలంలోని పోలకల్లు గ్రామానికి చెందిన రైతు మాదన్న (55) ు అప్పులబాధ తాళలేక మంగళవారం పొలానికి పిచికారి చేయడానికి తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకపోతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మాదన్న తనకున్న ఎకరా పొలంతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, ఉల్లి, మిరప పంటలను సాగు చేస్తున్నాడు. గత మూడు సంవత్సరాల నుండి పంటలు చేతికి రాక అప్పులు పెరగడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామ వీఆర్వోలు రైతు వివరాలను సేకరించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం కోసం తరలించినట్లు తెలిపారు.

ఆ నిర్మాణాలపై చర్యలు తీసుకోవద్దు

● మున్సిపల్ కమిషనర్‌కు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి లేఖ

కర్నూలు(లీగల్), అక్టోబరు 8: స్థానిక జొహరాపురం గ్రామంలోని 9 ప్లాట్లపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కర్నూలు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం ఒక లేఖ ద్వారా తెలియజేశారు. జొహరాపురం గ్రామంలోని 142 సర్వే నెంబరులో ఉన్న 9 ప్లాట్లపై ఉన్న కట్టడాలపై చర్యలు తీసుకునేందుకు కర్నూలు మున్సిపల్ అధికారులు పూనుకోవడంతో సదురు ప్లాట్ల యజమానులు ఏడుగురు హైకోర్టును ఆశ్రయించారు. సదురు ప్లాట్లపై రెవెన్యూ అధికారులకు ఎటువంటి అధికారం లేదని, అయినా కూడా కట్టడాలను పడగొట్టి ఆ ప్లాట్లను స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు యత్నిస్తున్నారని వారు హైకోర్టుకు తెలియజేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని రాష్ట్ర ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా తమ కౌంటర్ల అఫిడవిట్లను దాఖలు చేయాలని రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తదుపరి చర్యలను తీసుకోవద్దంటూ జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



వై.నాగేశ్వరరావు యాదవ్‌ను సన్మానిస్తున్న నూతన కమిటీ నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 8: ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయని రాష్ట్ర ఫెడరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 31 మంది దరఖాస్తులు చేశారని, టీడీపీ అధికారంలో ఉన్నందున బీసీల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో ఉన్నందు వల్ల ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధి చెంది గొర్రెలు, మేకల పెంపకందారులకు జీవనోపాధి ఉంటుందని, అందువల్లనే పోటీలో ఉన్న కొంత మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు టీడీపీ కార్యాలయంలో వై.నాగేశ్వరరావు యాదవ్‌ను సన్మానించారు.

● **ఉమ్మడి జిల్లా ఫెడరేషన్ నూతన కమిటీ**

చైర్మన్‌గా శ్రీనివాసులు (సల్కాపురం), వైస్ చైర్మన్‌గా గొల్ల యామ గుర్రప్ప (ఆళ్లగడ్డ), డైరెక్టర్లు అయ్యన్న యాదవ్ (పాణ్యం), కొత్తకోట ఎన్.శ్రీనివాసులు (డోన్), వెంకటేశ్వర్లు (పత్తికొండ), ఉపేంద్ర (ఆలూరు), మద్దయ్య (అవుకు), మద్దిలేటి (గోనెగండ్ల), చంద్రశేఖర్ (రామలింగాయపల్లె), యుగంధర్ (జిలకల గూడూరు), రాముడు (కోసిగి), హనిమిరెడ్డి (ఆదోని)లు ఎన్నికయ్యారు.

రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తాం



రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల, సుబ్బారెడ్డి

బేతంచెర్ల, అక్టోబరు 8 : ఖరీఫ్ సాగుకు రాయితీపై శనగ విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య అధ్యక్షతన రాయితీపై పప్పుశనగ విత్తనాలను ఎమ్మెల్యే కోట్ల, చైర్మన్ సుబ్బారెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల అభ్యున్నతికి టీడీపీ కృషి చేస్తున్నదన్నారు.

కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న కోట్ల: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి దేవిని మంగళవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పవన్ కుమార్ శర్మ పూర్ణకుంభంతో కోట్లకు స్వాగతం పలికారు. మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే కోట్లను శాలువతో సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

ప్యాపిలి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కోట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంద న్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, పీఆర్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణయాదవ్, అలేబాదు పరమేష్, టి శ్రీనివాసులు, మోపూరి రామక్రిష్ణ, అధికారులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి



డీఐజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 8: కర్నూలులో డీఐజీ కోయ ప్రవీణ్‌ను చైర్మన్ సుబ్బారెడ్డితోపాటు టీడీపీ యువ నాయకుడు గౌతమ్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానిం చారు.

సుబ్బారెడ్డిని కలిసిన సీడ్స్ కార్పొరేషన్ అధికారులు: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని రాయలసీమ సీడ్స్ కార్పొరేషన్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో రాయ లసీమ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో చైర్మన్ సుబ్బారెడ్డి సమావేశమయ్యారు. విత్తన పంపిణీలో రైతులకు ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అం దించేలా పని చేయాలని సుబ్బారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.

తగ్గని వరద నీరు

- నీటి కుంటలను తలపిస్తున్న పంట పొలాలు
- నష్టపోయామంటూ రైతుల ఆవేదన



నీట మునిగిన పంట పొలంలో రైతులు

చాగలమర్రి, అక్టోబరు 8: మండలంలోని కలుగొట్లపల్లె రహదారిలో పంట పొలాలు నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన కుండపోత వర్షానికి రైతులు సాగు చేసిన పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. వారం రోజులు దాటిన పంట పొలాల్లో వరద నీటి ఉధృతి తగ్గక పోవడంతో రైతులు, కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. మినుము, జొన్న పంటలు దెబ్బతిని నష్టపోయామని రైతులు వాపోతున్నారు. కొత్తగా రహదారి వేయడంతో వరద నీరంతా పంట పొలాల్లో నిలిచింది. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వరద నీరు పోయేలా చర్యలు తీసుకొని బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు

రాయితీ శనగ విత్తనాలను వినియోగించుకోండి

అవుకు, అక్టోబరు 8: ప్రభుత్వం 25 శాతం రాయితీపై అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకేసుల, కాశీపురం గ్రామాల రైతులతో సమావేశాన్ని నిర్వహించి భూసార పరీక్షా నమూనా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలానికి 2021 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్ర మంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు పఠాన్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

బిజినవేములలో 'పొలం పిలుస్తోంది'

కోవెలకుంట్ల, అక్టోబరు 8: కోవెలకుంట్ల మండలంలోని బిజినవేముల, వెలగటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటల యాజమాన్యం, శనగ విత్తన పంపిణీ, పురుగుల తెగుళ్ల నివారణ, ఈక్రాప్ పంట నమోదు, భూసార పరిరక్షణ ఆవశ్యకతపై మండల వ్యవ సాయాధికారులు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పశు సంవర్ధకశాఖ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: కంది పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని బీటీఎం ఏవో ఉమామహేశ్వరి తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో అధికారులు పర్యటించి పంటలపై అవగాహన కల్పించారు.

విత్తన శుద్ధి తప్పనిసరి: ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న శనగ పంట సాగుకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని బీటీఎం ఏవో ఉమమహేశ్వరి తెలిపారు. అల్లూరు గ్రామంలో రైతులతో ఆమె సమావేశమై రైతులతో మాట్లాడారు. కేజీ విత్తనాలలో 8నుంచి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరడిని కలిసి శుద్ధి చేయాలన్నారు.

చాగలమర్రి: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లేవేముల, చాగలమర్రి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం: వ్యవసాయంలో రైతులు అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని ఏవో శ్రీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని పేరూరు చిన్నకంబలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పేరూరులో రైతులు సాగు చేసిన పత్తిపంట పొలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి రైతులకు సలహాలు సూచనలిచ్చారు. కాగా, అనుబంధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఏఈవో రాజు, వీఏఏ గౌరీ, చాణక్య పాల్గొన్నారు.

పొగాకు సాగులో మెలకువలపై అవగాహన

శిరివెళ్ల, అక్టోబరు 8: పొగాకు సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, మెలకువలపై మండల వ్యవసాయాధికారి సుధాకర్ మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మహదేవపురం, గుండంపాడు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. రైతులు సాగు చేసిన వివిధ పం టలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని ఎఫ్‌టీసీ ఏవో చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని అర్జునాపురం, గుండుపాపల, కొత్తపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



అఖిలప్రియతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 8: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సైతం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రాష్ట్రస్థాయి ఫుడ్‌బాల్ పోటీలకు ఎంపికైన విశ్వనాథ్, ఓబులేసు, నరసింహలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కేవీకే ఇండోర్ స్టేడియం కోచ్ సుబ్బరాయుడులను ఎమ్మెల్యే తన స్వగృహంలో మంగళవారం అభినందించారు. నంద్యాల జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్న క్రీడాకారులు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో బుధవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జరిగే అంతర్ జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కోచ్ వెల్లడించారు.

భారతీయ సంస్కృతిని గౌరవించాలి



బొమ్మల కొలువును పరిశీలిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 8: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలసిన అమ్మవారిశాల పక్కనే ఉన్న సుధీర్ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువును బీసీ రాజారెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా సుధీర్ ఇంట్లో బొమ్మలకొలువు ఏర్పాటు చేసి సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని అన్నారు.

అమ్మవారిశాలలో కోట్ల సుజాతమ్మ

డోన్, అక్టోబరు 8: పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అమ్మవారి సేవలో తరించారు. అమ్మవారిశాలలో కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పాత బస్టాండులో దుర్గామాత విగ్రహానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రజిని, ఎన్ఈ సరోజ పాల్గొన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న ధర్మవరం సుబ్బారెడ్డి

బేతంచెర్ల, అక్టోబరు 8: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేద పండితులు, అర్చకులు సుబ్బారెడ్డికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఈవో రామాంజనేయులు, వేద పండితులు, అర్చకులు సుబ్బారెడ్డిని శేషవస్త్రం, చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు.

మద్యం షాపులకు 92 దరఖాస్తులు

డోన్(రూరల్), అక్టోబరు 8: నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా డోన్ నియోజకవర్గంలో మద్యం షాపులకు జరుగుతున్న టెండర్లలో ఇప్పటి వరకు 92 దరఖాస్తులు వచ్చినట్లు డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ ఎస్ఐ సోమశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీక రణ గడువు ఉందని తెలిపారు.

కొలిమిగుండ్ల: బనగానపల్లె డివిజన్ పరిధిలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాలకు సంబంధించి 12 మద్యం షాపులకు గాను 37 దరఖాస్తులు వచ్చినట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. మంగళవారం కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబుతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కొలిమిగుండ్ల మండలంలో మూడు షాపులకు సంబంధించి ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు సీఐలు తెలిపారు.

రుద్రవరం: ఆళ్లగడ్డ పరిధిలో మద్యంషాపులు కోసం టెండరు దరఖాస్తులను ఎవరైనా చేయవచ్చని ఎక్సైజ్ సీఐ క్రిష్ణమూర్తి అన్నారు. మంగళవారం రుద్రవరం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్‌లైన్‌లో కానీ రూ.2 లక్షలు రుసుం చెల్లించి బుధవారం లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు

శిరివెళ్ల, అక్టోబరు 8 : నూతన మద్యం పాలసీలో భాగంగా ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఆళ్లగడ్డ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. శిరివెళ్లలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకునే సౌకర్యం ఉన్నందున ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నూతన మద్యం పాలసీపై అవగాహన

సంజామల, అక్టోబరు 8: మండల కేంద్రమైన సంజామలలో మంగళవారం నూతన మద్యం పాలసీపై ఎక్సైజ్ ఎస్.ఐ తన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ నెల 9లోపు రూ.2లక్షలు నాన్ రీఫండబుల్ ఫీజు చెల్లించి ఎన్నిషాపులకైన ఒకే వ్యక్తి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

ఘనంగా మొదటి పీఠాధిపతి జయంతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 8: అహోబిలంలో మొదటి పీఠాధిపతి ఆదివణ్ శఠగోపన్ యతీంద్ర మహాదేశికన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారితో పాటు పీఠాధిపతి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులతో పాటు మొదటి పీఠాధిపతి ఉత్సవమూర్తిని సైతం విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

వైభవంగా స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం



గొర్రెల పెంపకందారుల సహకార

సంఘం డైరెక్టర్‌గా కొత్తకోట శ్రీను



ఎన్నికైన పత్రం అందుకుంటున్న కొత్తకోట శ్రీను

డోన్, అక్టోబరు 8: ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం డైరెక్టర్‌గా కొత్తకోట శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కొత్తకోట గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ప్రెసిడెంటుగా కొత్తకోట శ్రీను ఉన్నారు. మంగళవారం కర్నూలులో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్లను ఎన్నుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, రాంపుల్లయ్య యాదవ్ సహకారంతో కొత్తకోట శ్రీను జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు.

పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలి

బేతంచెర్ల, అక్టోబరు 8: పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. షేబారాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వైబీ వెంకటేశ్వర్లు మంగళవారం అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణం, గ్రామాల్లో సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు పాత పద్ధతిలోనే రేషన్ (బియ్యం, కందిపప్పు) పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయం నుంచి అంగన్‌వాడీల మండల కార్యదర్శి ఎన్‌కే నాగలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయు పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు అధ్యక్షతన నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, అక్టోబరు 8: జిల్లాలో టీబీ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఆశాడేను వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 నుంచి 60 ఏళ్లు పైబడిన వారికి తప్పక బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. 16 సంవత్సరాల వరకు వ్యాధి నిరోధక టీకాలు, వ్యాక్సినేషన్‌లు వేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీహెచ్‌వో జగదీశ్వరప్ప, వైద్యులు అంజలి, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమాంబకు పూజలు

డోన్(రూరల్), అక్టోబరు 8: పట్టణంలోని కొండపేటలో వెలసిన ఎల్లమాంబకు ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్ జిల్లాకు చెందిన లక్ష్మీజగదీష్ దంపతులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సుశీలమ్మకు పరామర్శ

బనగానపల్లె, అక్టోబరు 8: బనగానపలె పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు బొబ్బల మహేశ్వరరెడ్డి తల్లి సుశీలమ్మ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో ఆమెను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళవారం పరామర్శించారు. మహేశ్వరరెడ్డిని కలసి సుశీలమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

లారీ బోల్తా .. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 8: మండలంలోని కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగు బ్రిడ్జిపై నుంచి సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మంగళవారం తెల్లవారు జామున తాడిపత్రి వైపు నుండి వెళుతున్న లారీ అదుపు తప్పి వంకలో పడి పోయింది. అందులో డ్రైవర్ మాత్రమే ఉండటం స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. రోడ్డు రవాణా శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటంలేదని వాహనదారులు వాపోతున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

చాగలమర్రి, అక్టోబరు 8: చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో నిధుల దుర్వినియోగంపై జిల్లా అదనపు వైద్యశాఖ అధికారి శారదాబాయి, బీసీబీఎస్ అధికారి మాధవీలత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శివనాగిరెడ్డి మంగళవారం వైద్యశాలను పరిశీలించారు. వివిధ రికార్డులను పరిశీలించి వైద్యుల పనితీరుపై విచారణ చేశారు. ఈ సందర్భంగా అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి మాట్లాడుతూ వైద్యశాల చైర్మన్, ఎంపీపీ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని అన్నారు. నివేదికలను కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

800 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు

చాగలమర్రి, అక్టోబరు 8: మండలంలో రైతులకు రబీ సీజన్ కింద 800 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాల కోసం ఆర్‌బీకేలలో రైతుల నుంచి పరిమిట్ల కోసం రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని అన్నారు. మల్లేవేముల, పెద్దబోదనం, నేలంపాడు, మద్దూరు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లోని రైతులకు 25శాతం సబ్సీడీతో శనగ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. రైతులు క్వింటాకు రూ.7050 నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఏఈవోలు మంజుల, అస్రఫ్ పాల్గొన్నారు.

నేడు ఆళ్లగడ్డలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 8 : పట్టణంలోని టీబీ రోడ్డులో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 8 గంటలకు అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, మున్సిపల్, సచివా లయ ఉద్యోగులు పాల్గొనాలని కమిషనర్ కోరారు.

ఘనంగా వన్యప్రాణుల వారోత్సవాలు

డోన్(రూరల్), అక్టోబరు 8: డోన్ అటవి శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం డోన్ అటవీ శాఖ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్ కుమార్ నిర్వహించిన ఈ ర్యాలీని డీఆర్వో శివశంకర్ పాల్గొని ప్రారంభించారు

రుద్రవరం: రుద్రవరం రేంజ్ పరిధిలోని ఈ నెల 2 నుంచి 8వ తేదీతో వన్యప్రాణి సప్తాహ వారోత్సవాలు ముగిశాయని రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. మంళవారం తిప్పారెడ్డిపల్లె గ్రామంలో వన్యప్రాణి వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి మంగళవారం వరకు గ్రామాల్లో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి వన్యప్రాణులపై అవగాహన కల్పించామన్నారు. సెక్షన్ ఆఫీసరు శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని డి.వనిపెంట సెక్షన్ అధికారి రామకృష్ణ తెలిపారు. మంగళవారం వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా కేపీ తండా గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే చట్ట ప్రకారం శిక్ష తప్పదని అన్నారు. అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లరాదని, చెట్లను నరకవద్దని, నిప్పు పెట్టరాదని అన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు నగేష్, జంగం, సుభాష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెద్దమ్మకు భూమా జగత్ పూజలు

దొర్నిపాడు, అక్టోబరు 8: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతక ముందు భూమా జగత్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు భూమా జగత్‌కు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఆయన వెంట భూమా సంతోష్‌రెడ్డి, భూమా సందీప్‌రెడ్డి ఉన్నారు.

నేలవాలిన మొక్కజొన్న పంట

రుద్రవరం, అక్టోబరు 8 : మండలంలోని యల్లావత్తుల, డికొట్టాల గ్రామాల పరిధిలో సోమవారం రాత్రి గాలివానకు మొక్కజొన్న పంట నేలవాలిందని మంగళవారం రైతులు తెలిపారు. చేతికందే దశలో ఉన్న పంట నేల వాలడంతో నష్టపోతామని రైతులు వాపోయారు. వ్యవసాయాశాఖాధికారులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

వివిధ రూపాల్లో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం అమ్మవారి ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతులు, అర్చనాది సహస్రనామావళి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.



నందవరంలో కాత్యాయని మాత అలంకారంలో అమ్మవారు



చాగలమర్రిలో భవానిదేవిగా..




కోవెలకుంట్లలో బాల త్రిపుర సుందరీదేవిగా..



ఉయ్యాలవాడలో లక్ష్మీదేవిగా..



తిమ్మనాయినిపేటలో అష్టలక్ష్మీదేవిగా..



రుద్రవరంలో అన్నపూర్ణదేవిగా..



బేతంచెర్లలో రాజరాజేశ్వరి దేవిగా..



అవుకులో సంతానలక్ష్మీదేవిగా..